సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



రైల్వేలో మోగిన ఎన్నికల నగారా

భారతీయ రైల్వేలో ఎన్నికల నగారా మోగింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలకు రైల్వే యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. -8లో



శ్రీవారి లడ్డూపై రాజకీయం తగదు

శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై రాజకీయం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.320	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 112 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

24న గోపనపల్లెలో ప్రజాదర్బార్

గాలివీడు: మండలంలోని గోపనపల్లె గ్రామంలో ఈనెల 24వ తేదీ రవాణా,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. అదే రోజు సచివాలయం ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యలపై మంత్రి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

సౌమ్యనాథున్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నందలూరు: నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గమ్మినేని రామకృష్ణ ప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టత గురించి వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట విశ్రాంత రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సీతారామమూర్తి దంపతులు, వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, నందలూరు కోర్టు మేజిస్ట్రేట్ భార్గవి, రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్, నందలూరు కోర్టు సూపరింటెండెంట్ రమేష్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్): ఓపెన్ స్కూల్ 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యు.శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. అలాగే ఈ నెల 29, 30వ తేదీల్లో రూ.200 అపరాధ రుసుముతో ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని చెప్పారు. జిల్లాలోని డ్రాపౌట్ స్టూడెంట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 10వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు అర్హత కలిగిన 754 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వారిని మండలంలోని కో–ఆర్డినేటర్లు తమ సెంటర్స్‌లో చేర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు

బి.కొత్తకోట: కలెక్టర్ నిర్దేశించిన పక్కా గృహల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించిన ములకలచెరువు మండలానికి చెందిన నలుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం ద్వారా గత ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయించాలని కలెక్టర్ లక్ష్యాలను నిర్దేశించారు. అయితే మండలంలోని చౌడసముద్రం, కదిరినాథునికోట, కాలవపల్లె, ములకలచెరువు–2 సచివాలయాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఈనెల 13 నుంచి 19 వరకు ఒక్క ఇంటి లక్ష్యం కూడా చేయలేదు. దీంతో రెండురోజుల్లో వివరణ ఇవ్వాలని వీరికి అధికారులు నోటీసులు జారీ చేశారు. వీరి సంజాయిషీ అనంతరం చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె/చిన్నమండెం: సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో, చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నాగేశ్వరనాయుడు, శశిధర్‌రెడ్డి, నాయకులు శివప్రసాద్,రంగారెడ్డి, సిద్దారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

కాగుతున్న నూనె

ఖర్చు పెరిగింది




నా పేరు అజంతుల్లా. రాయచోటిలోని గాంధీ బజారులో మిక్చర్ బండి నడుపుతుంటాను. అయితే నూనె ధరలు పెరగడంతో ఆదాయంలో కోత పడుతోంది. ఎందుకంటే మిక్చర్, జాంగ్రీలు, పకోడ, ఇతర స్వీట్ల తయారీకి ప్రతిరోజు 15 లీటర్ల వరకు నూనె వాడాల్సి ఉంటుంది. దీంతో రూ. 300కు పైగా అదనపు భారం పడుతోంది. ఇంతకుముందు ఎంతోకొంత వచ్చిన లాభంలో ఉపశమనం ఉండేది. ప్రస్తుతం పెరిగిన ధరలతో కొనుగోలు, ఆదాయం సరాసరి అవుతోంది.

- సుంకాలను పెంచడంతో ఆయిల్‌పై పెనుభారం
- వేరుశనగ, సన్‌ఫ్లవర్, పామాయిల్ తదితర బ్రాండ్లపై ధరాఘాతం
- లీటరుపై రూ. 20–30 మేర పెరిగిన ధరలు
- పేద, మధ్యతరగతి వర్గాలకు తీవ్ర ఇబ్బందులు





ఆయిల్ (లీటరు)	గతంలో (రూ.లలో)	ప్రస్తుతం (రూ.లలో)
పామోలిన్	95	113
వేరుశనగ నూనె	115	135
సన్ ఫ్లవర్	110	130



సాక్షి రాయచోటి: అధికారంలోకి రాగానే నిత్యావసర సరుకులు మొదలుకొని వస్తువుల ధరలకు కళ్లెం వేస్తాం....సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టినా..ఇప్పుడు మాత్రం కూటమి సర్కార్ పట్టించుకోకపోవడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నిత్యావసరాలు మొదలుకొని కూరగాయల ధరలు అమాంతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు భారంగా మారుతోంది. ఇదే వరుసలో కేంద్ర ప్రభుత్వం 20 శాతం సుంకం పెంచడంతో నూనె ధరలకు రెక్కలొచ్చాయి. పది రోజుల వరకు రూ. 115లోపు అమ్ముతున్న లీటరు ఆయిల్ ప్యాకెట్లు ప్రస్తుతం రూ. 135కు పెరిగిపోయాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి సర్కార్ ధరలపై పెదవి విప్పకపోవడంతో ఏం తినాలి.... ఏం కొనాలి..అన్నట్లుంది పరిస్థితి.

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో కష్టాలు

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచడంతో నూనె సంబంధిత సంస్థలు భారాన్ని ప్రజలపై మోపాయి. ముడి సరుకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు గతంలో ఎటువంటి సుంకాలు (బేసిక్ కస్టమ్ డ్యూటీ) లేవు. అయితే కేంద్ర ప్రభుత్వం 20 శాతం దిగుమతి సుంకం విధించడంతో భారం పెరిగిపోయింది. అలాగే శుద్ధి (రీఫండ్)చేసిన వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచడంతో సమస్య ఏర్పడింది.ఒక్కో కుటుంబం సరాసరిన నెలకు ఐదు లీటర్ల వరకు వినియోగించే అవకాశం ఉంది. ఈ లెక్కన కుటుంబంపై రూ. 100 వరకు అదనపు భారం పడుతుండగా ఆయా కుటుంబాలపై నెలకు రూ. 5.20 కోట్ల అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. జిల్లాలో సుమారు 5.20 లక్షల కుటుంబాలు నివసిస్తున్నాయి. వంటలకు సంబంధించి ప్రతినిత్యం నూనెతో అవసరం ఉంటుంది. సన్‌ఫ్లవర్, వేరుశనగ, సోయాబిన్, పామోలిన్ ఇలా నూనెలకు సంబంధించి ధరలు పెరిగిపోయాయి.

పది రోజుల కిందటి వరకు రూ. 110–115 వరకు ఉన్న ధర ప్రస్తుతం రూ. 135కు చేరింది. పెరిగిన ధరల నుంచి పేదలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం రాయితీపై అందించాలని ప్రజలు కోరుతున్నారు. తాము అధికారంలోకి వస్తే కందిపప్పు, వంట నూనెలను సరఫరా చేస్తామని కూటమి సర్కార్ అప్పట్లో హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు కాలేదు. నూనె ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యులపై ధరల భారం...



కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే సామాన్యులపై ధరల భారం మోపింది. గతం కంటే వంటనూనె ధరలు లీటరుకు రూ. 20 నుంచి రూ. 35 వరకు పెరిగాయి.సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు గతంలో రూ. 108 కాగా ప్రస్తుతం రూ. 135కు పెరిగింది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. – శేఖర్, తలపుల, పీలేరు మండలం.

ప్రభుత్వం చొరవ చూపాలి



రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. దీనికి తోడు ఐదు రోజులుగా నూనె ధరలు కిలోకు రూ.20–30 వరకు పెరిగాయి. ప్రభుత్వాలు చొరవ చూపి ధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. –రాధా, గృహిణి, అమినేనివీధి, మదనపల్లె

ధరలను నియంత్రించాలి




దినసరి కూలీ పనులకు వెళ్లే మా లాంటి పేదలకు వంట నూనె అందని ద్రాక్షలా మారింది. ప్రస్తుత ప్రభుత్వం నిత్యావసర సరుకులు, వంట నూనెల ధరలను తగ్గిస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చింది. తీరా చూస్తే ఆ ఊసే ఎత్తకపోవడం దారుణం. ఇప్పటికైనా ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. – చల్ల నాగేశ్వర, మల్లూరు, చిన్నమండెం మండలం

కానిస్టేబుల్‌పై వేటు

ప్రొద్దుటూరు క్రైం: పేకాట ఆడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్‌పై ఎస్పీ వేటు వేశారు. ఈ నెల 7న దొరసానిపల్లెలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడిలో 17 మందిని అరెస్ట్ చేశారు. వారిలో కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న శివ అనే కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. దీనిపై రూరల్ పోలీసు అధికారులు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు నివేదిక పంపిచారు. విచారణ అనంతరం కానిస్టేబుల్ శివను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ శివ మాలెపాడు గ్రామంలో పికెటింగ్ విధులు నిర్వహిస్తున్నాడు.

24న ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు



కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 24న జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి తెలిపారు. రెజ్లింగ్ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా కడప డీఎస్‌ఏ స్టేడియంలో అదే రోజు బాస్కెట్‌బాల్ అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

28న అథ్లెటిక్స్ ఎంపికలు..

ఈనెల 28న ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపికలు కడప నగరంలోని వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలకు తేదీలు వచ్చిన కారణంగా జిల్లాలోని అన్ని మండలాలు, నియోజకవర్గస్థాయి ఎంపికలు పూర్తి చేసుకుని ఈనెల 28వ తేదీన కడపలో నిర్వహించే జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు క్రీడాకారులను పంపాలని కోరారు.

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ సమీక్షించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, మండల స్పెషల్ అధికారులు, మండల సర్వేయర్లతో మాట్లాడారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం, స్వర్ణాంధ్ర-2047 సాధనకు విజన్ డాక్యుమెంట్ రూపొందించడానికి ఈ పోర్టల్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ తదితరాల అంశాలపై చేపట్టాల్సిన కార్యాచరణపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ, డీపీఓ, సర్వేశాఖ ఏడీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

తహసీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: తహసీల్దార్లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో పనిచేస్తున్న రమేష్‌ను కర్నూలు, సువర్ణదేవిని నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న సుబ్బలక్షుమ్మను, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న దస్తగిరయ్యను కడపకు బదిలీ చేశారు. అలాగే అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఉదయ్‌శంకర్ రాజు, సక్సేనా లను సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

పీలేరురూరల్: జిల్లాలోని ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ కొండయ్య అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధికి మించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అనంతరం ఆశా వర్కర్ల నుంచి అర్జీలు స్వీకరించారు.డీసీఎం సుగుణ, విజయ్, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ మహ్మద్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

23 లోగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

సంబేపల్లె: పంటలు సాగు చేసి రైతులు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. అనంతరం వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

కలికిరి: మండలంలోని చీకటపల్లిలో జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ ఆధ్వర్యంలో శనివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. సర్వే నంబర్ 201లోని రైతు శేషారెడ్డి పొలంలో ఐదు మీటర్ల విస్తీర్ణంలో పంట నూర్పిడి చేశారు. సాధారణంగా ఆరు నుంచి 10కిలోల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 1.2 కిలోలు వచ్చింది. సర్వే నంబర్ 214/3లోని సరోజమ్మ పొలంలో ఐదు మీటర్ల విస్తీర్ణంలో 0.170 కిలోల దిగుబడి వచ్చింది. వర్షాభావం కారణంగా పంట పూర్తిగా నష్టపోయినట్లు రైతులు అధికారులకు వివరించారు. అనంతరం గుట్టపాళెంలో ఇ-పంట నమోదు, ఈకేవైసీ నమోదు ప్రక్రియను జేడీ పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి మమతారెడ్డి, ఏఈఓ రమేష్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది నాగేశ్వర్‌నాయక్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

ఎండిన పంట.. రైతన్న చింత

ఎన్నో ఆశలతో సాగు చేసిన వేరుశనగ పంట రైతులను నట్టేట ముంచింది. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో పంట ఎండిపోయింది. జిల్లాలో 15936 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వేరుశనగ పంట సాగు చేశారు. జిల్లావ్యాప్తంగా రూ.59,75,99,500 మేరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.



వంకాయల వారిపల్లె వద్ద ఎండిపోయిన వేరుశనగపంట



బోడుమల్లువారిపల్లె వద్ద...

- అన్నదాతకు కడుపుకోత మిగిల్చిన వేరుశనగ సాగు
- జిల్లాలో 15936 హెక్టార్లలో సాగు
- పశుగ్రాసంగా మారిన పంట
- రూ.59.76 కోట్ల మేరకు నష్టం

గుర్రంకొండ: జిల్లా వ్యాప్తంగా వేరుశనగ పంట ఎండిపోయింది. నెలరోజులుగా వర్షాలు కురవక పోవడంతో వేరుశనగ చెట్లు ఎర్రబారిపోయి పూర్తిగా ఎండిపోయాయి. కాయల్లో ఉన్న అరకొర గింజల్లో తేమశాతం కూడా లేక లొత్తలుగా మారాయి. ఒక్కో చెట్టుకు పదినుంచి పన్నెండు వరకు కాయలు, ఎనిమిది నుంచి పది బుడ్డకాయలు ఉన్నాయి. పదిరోజుల కింద వర్షాలు కురిసి ఉంటే ప్రస్తుతం పంట చేతికొచ్చి కోతదశలో ఉండేది. అప్పట్లో వర్షాలు కురవకపోవడంతో భూమిలోపల చెట్టుకు ఏర్పడ్డ బుడ్డకాయలు, కొద్దిశాతం గింజలున్న కాయలు ఎండిపోయాయి. ఎండిపోయి ఉన్న చెట్లలో కాయలున్నప్పటికీ అందులో గింజలు 25శాతం కూడా ఏర్పడకపోవడం గమనార్హం.

పశుగ్రాసంగా మారిన పంట: చెట్లు, భూమిలోపల కాయలు పూర్తిగా ఎండిపోవడంతో పంట 30 శాతం మేరకు కూడా రైతుల చేతికొచ్చే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో పంట మొత్తం పశుగ్రాసంగా మారిపోనుంది. ప్రస్తుతం వర్షాలు కురిసినా పంట చేతికందదని రైతులు అంటున్నారు. ఒకవేళ చెట్టుకున్న అరకొర కాయలు తీసుకోవాలన్నా బోలేడు ఖర్చుతో కూడున్న పని. ఎంతలేదన్నా ఒక హెక్టారుకు రూ. 25,000 వరకు ఖర్చుచేయాల్సి ఉంటుంది. ఇది కాస్తా రైతుకు అదనపు భారంగా మారుతుంది. దీంతో చేసేది లేక రైతులు ఎండిపోయిన పంటను పశుగ్రాసంగా వినియోగించు కోవడానికి సిద్ధమయ్యారు.

ఇన్‌పుట్ సబ్సిడీపైనే ఆశలు

జిల్లాలో వేరుశనగ పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వం అందజేసే ఇన్‌పుట్ సబ్సిడీపైనే ఆశలు పెట్టుకొన్నారు. ఇప్పటికేజిల్లా వ్యాప్తంగా వేరుశెనగ పంట సాగు చేసిన ఈక్రాప్ నమోదు చేయించుకొన్నారు. జిల్లాలో ఇప్పటికీ ఈక్రాప్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ప్రభుత్వం అందించే పంట లభీమా, ఇన్‌పుట్ సబ్సిడీలపైనే రైతుల భవిష్యత్తు ఆధారం పడి ఉంది. పంటనష్టపరిహారం కూడా సకాలంలో అందేలా ప్రభుత్వం , అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో సాగు చేసిన వేరుశనగ పంట వివరాలు

నియోజకవర్గం	పంటసాగు (హెక్టార్లలో)	నష్టం (అంచనా)
పీలేరు	2985	11,19,37,500
మదనపల్లె	3152	11,82,00,000
తంబళ్లపల్లె	3286	12,32.25,000
రాయచోటి	4123	15,46,12,000
రైల్వేకోడూరు	1254	04,70,25,000
రాజంపేట	1136	04,26,00,000

రూ. 59.76 కోట్ల నష్టం



జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వేరుశనగ సాగు చేసిన రైతులు రూ .59.76 కోట్ల మేరకు నష్టపోయారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్లో 15936 హెక్టార్లలో రైతులు వేరుశనగ పంట సాగు చేశారు. ఒక హెక్టారు పంటసాగు కోసం ఇప్పటి వరకు రూ. 37,500 ఖర్చుచేశారు. పొలం దుక్కుల దగ్గర నుంచి విత్తనాల కొనుగోలు, పంట కలుపు నివారణ ఖర్చులు కలుపుకొంటే హెక్టారుకు రూ. 37,500 ఖర్చు అవుతుంది. ప్రస్తుతం వర్షాలు కురవక పంట మొత్తం ఎండిపోయింది. దీంతో రైతులు పలు గ్రామాల్లో పంట కోయకుండా పొలాపైనే వదిలేశారు.

పెట్టుబడి నష్టపోయాం



మూడున్నర ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశాను. వాన కురవక పంట ఎండిపోయింది. మూడున్నర ఎకరాలకు ఏడు బస్తాల వేరుశ నగ కాయల డబ్బులు చెల్లించాలి. దీనికి తో డు పంటసాగు కోసం రూ. 45 వేలు ఖ ర్చుచేశాం.పెట్టుబడి డబ్బులు నష్టపోయాం. – బి. శ్రీనివాసులు, కౌలురైతు, వంకాయలవారిపల్లె

కాయలు,బుడ్డలు ఎండిపోయాయి



ఒకటిన్నర ఎకరాలో పంట సాగు చేశాను. చినుకు జాడ లేక పోవడంతో భూమి లోపల ఉన్న కాయలు, బుడ్డలు ఎండిపోయాయి. పంట కోత చేపట్టాలంటే హెక్టారుకు అదనంగా రూ. 15 వేలు ఖర్చు చేయాలి.అందువల్ల పంట కోసి పశువులకు మేతగాా వేయాలని అనుకొంటున్నాం. – కృష్ణమ్మ, వంకాయలవారిపల్లె

ప్రభుత్వం ఆదుకోవాలి



వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. పంటల బీమాతోపాటు ఇన్‌పుట్‌సబ్సిడీ సకాలంలో ఇవ్వాలి. పంట సాగు చేసిన ప్రతి రైతు ఇ- క్రాప్‌నమోదు చేసుకున్నాడు. పంటనష్టపరిహారాన్ని త్వరగా అందజేయాలి. -కె.శ్రీనివాసులురెడ్డి, రైతు, ఎగువబురుజుపల్లె

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు హైకోర్టులో ఊరట

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు నిర్వహణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఈనెల 13న కేసు నమోదైన విషయం తెలిసిందే. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9 మందిపైన, మరో 50 మంది ఇతరులు అని పేర్కొంటూ ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఊరేగింపులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటలు పెట్టి రెచ్చగొట్టేలా వ్యవహరించారని, పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శ్రేణులకు అండగా నిలిచారు. ఎఫ్ఐఆర్‌పై హైకోర్టులో కేసు వేయగా న్యాయమూర్తి నిందితులపై రెండు వారాలు చర్యలు తీసుకోవద్దని, 41ఏ నిబంధన పాటించాలని సూచిస్తూ ఆదేశాలిచ్చారు.

వికసించిన బ్రహ్మకమలం



గుర్రంకొండ : గుర్రంకొండలోని బజారు వీధికి చెందిన కందుల సుబ్బారావు ఇంట్లో శనివారం ఆరు బ్రహ్మ కమలాలు వికసించాయి. ఎంతో విశిష్టత కలిగిన బ్రహ్మ కమలాలు ఒకే రోజు వికసించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

రైల్వేలో మోగిన ఎన్నికల నగారా

- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సన్నాహాలు
- డిసెంబర్ 4, 5, 6లలో నిర్వహణపై దృష్టి
- మెంబర్‌షిప్ పరిశీలనకు రైల్వేబోర్డు ఆదేశాలు
- సిద్ధమవుతున్న ఎస్ఆర్ఎంయూ, సంఘ్



రైలుమార్గం	: ముంబయి-చెన్నై
డివిజన్	: గుంతకల్లు
బ్రాంచీలు	: నందలూరు, కడప,
ఎన్నికలు	: డిసెంబరు
ప్రధాన సంఘాలు	: మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్
పోలింగ్ కేంద్రాలు	: నందలూరు, కడప, రైల్వేకోడూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురం

రాజంపేట : భారతీయ రైల్వేలో ఎన్నికల నగారా మోగింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలకు రైల్వే యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికలకు అవసరమయ్యే చర్యలు తీసుకొనేందుకు డివిజన్ స్థాయిలో అధికారులకు బాధ్యతలు అప్పగించింది. రైల్వేబోర్డు ఆదేశాలతో ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్)కు అనుబంధంగా ఉన్న సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే (ఎన్ఎఫ్ఐఆర్)కు అనుబంధంగా ఉన్న సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకత్వాలు జోన్, డివిజన్ స్థాయిలో క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నాయి.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వేడి రాజుకుంది. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో జిల్లా వరకు నందలూరు, కడప రైల్వే కేంద్రాలలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచీలు ఉన్నాయి. ఈ బ్రాంచీల పరిధిలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ సంఘాలను గెలిపించుకునేందుకు పోటీ పడుతున్నారు. రైల్వేబోర్డు ఆదేశాలతో కార్మిక సంఘాల నేతలు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు.

కోవిడ్‌తో వాయిదా వేస్తూ..

2013 ఏప్రిల్ మాసంలో భారతీయ రైల్వేలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. అప్పుడు సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ విజయఢంకా మోగించింది. 46 శాతం ఓట్లు దక్కించుకుంది. జోన్ స్థాయిలో 86 వేల ఓట్లలో 36 వేల ఓట్లను ఎస్ఆర్ఎంయూ సాధించింది. అయితే గుంతకల్లు డివిజన్ స్థాయిలో ఎస్ఆర్ఎంయూకు 694 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా.. కోవిడ్ కారణంతో రైల్వే యాజమాన్యం వాయిదా వేస్తూ వచ్చింది. 2024లో డిసెంబరు 4, 5, 6 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

సీక్రెట్ బ్యాలెట్ ద్వారా..

రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ సీక్రెట్ బ్యాలెట్ ద్వారా నిర్వహించడం జరుగుతుంది. గత ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతిలో నిర్వహించారు. నందలూరు, రైల్వేకోడూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటి పరిధిలో ఉన్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కు నియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలు ఇరు కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. గుంతకల్లు డివిజన్ పరిధిలో 13 వేల మంది సభ్యులుగా ఉన్నారు.

గెలుపు మాదే



రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో గెలుపు మాదే అన్న ధీమాలో ఉన్నాం. గత ఎన్నికలలో కూడా ఏఐఆర్ఎఫ్(ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్) దాని అనుబంధసంస్థ ఎస్ఆర్ఎంయూ(సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్)కు మెజార్టీ ఓట్లు వచ్చాయి. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసే సంఘం మాది. ఈ ఎన్నికల్లో కూడా కార్మికులు తమ పక్షాన నిలుస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నాం.

– విజయ్‌కుమార్, డివిజనల్ సెక్రటరీ, ఎస్ఆర్ఎంయూ

ఈ సారి మాదే విజయం



రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో ఈ సారి విజయం మాదే అనే ధీమాలో ఉన్నాం. కార్మికుల సమస్యల పరిష్కారంలో నేషనల్ ఫెడరేషన్ ఇండియన్ రైల్వేమెన్ దాని అనుబంధం సంఘం సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ముందంజలో ఉంటుంది. కాబట్టి ఎన్నికలలో కార్మికులు సంఘ్‌ను ఆదరిస్తారని ప్రగాఢ విశ్వాసం ఉంది. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమం కోసం కృషి చేసే ఏకైక కార్మిక సంఘం ఎన్ఎఫ్ఐఆర్.

– బీ.బాబు, డివిజనల్ ప్రెసిడెంట్, సంఘ్

శ్రీవారి లడ్డూపై రాజకీయం తగదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై రాజకీయం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. స్థానిక కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో పోలా వెంకటరెడ్డి శతజయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి 100 రోజుల పాలన గాడి తప్పడంతో ప్రజలను మభ్య పెట్టేందుకు కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని చంద్రబాబు ఆరోపించడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. నైతిక విలువలను ఏనాడో గాలికి వదిలేసిన సీఎం బాబు.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నించడం క్షమించరాని నేరమన్నారు. దేవుళ్లను సైతం తన నీచరాజకీయానికి వాడుకొనే ఏకైక సీఎం బాబు అని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక పోవడంతో ప్రజలు తిరగబడతారని గ్రహించి.. లడ్డూ ప్రసాదంపై బూటకపు కథ అల్లారని ఆగ్రహించారు. దాదాపు 23 పర్యాయాలు తాను వేలాది మందితో కలిసి తిరుమలకు పాదయాత్ర చేసి స్వామి వారి దర్శనం అనంతరం లడ్డూ ప్రసాదం తినేందుకు మక్కువ చూపానని గుర్తు చేసుకున్నారు. స్వామి వారి దర్శనం చేసుకొన్న వారు లడ్డూ ప్రసాదాన్ని తమ శక్త కొద్దీ తీసుకొచ్చి తమ బంధువులు, ఇరుగు పొరుగు వారికి అందజేయడం జరుగుతుందన్నారు. బాబు బూటకపు కథ నిజమయితే.. భక్తులు ఫిర్యాదు చేసే వారు కదా అని ప్రశ్నించారు. స్వచ్ఛమైన ఆవు పాల నెయ్యి కాకుండా కల్తీ జరిగివుంటే చెడువాసన రాదా అని ప్రశ్నించారు. రుచిలో తేడా కనిపించదా అని నిలదీశారు. వెంకటేశ్వరస్వామిని రాజకీయానికి వాడుకున్న సీఎం బాబు.. గతంలో జరిగిన ప్రమాదాన్ని గుర్తు చేసుకోవాలని హితబోధ చేశారు. ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రవేశ పెట్టి పాలన కొనసాగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోలా వెంకటరమణారెడ్డి, ఆయన కుమారుడు యువ నాయకుడు పోలా వాసవి ధీరజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి.. ఒకరి మృతి

- ఢీకొన్న మూడు వాహనాలు
- ఏడుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలు



మృతి చెందిన జాఫర్



తీవ్రంగా గాయపడ్డ ప్రకాష్‌బాబు

సంబేపల్లె : ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోవడంతో.. జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై బావులకాడపల్లె క్రాస్ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదనపల్లె నుంచి దేవపట్లకు వస్తున్న ఆటోను తిరుపతి నుంచి రాయచోటికి వెళుతున్న బొలెరో పికప్ వాహనం ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి.. ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారును ఢీకొంది. అలాగే పక్కన వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇన్నోవా కారులో ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన వెంకటరావు, భార్య అన్నపూర్ణ, కొడుకు ప్రకాష్‌బాబు, కోడలు, మనమరాలు ఆరాధ్యకు గాయాలయ్యాయి. వీరంతా తిరుమల దేవుని దర్శనానికి వెళ్తున్నారు. బొలెరోలో ప్రయాణిస్తున్న జాఫర్(49) మృతి చెందగా, అయ్యాబ్, సౌకత్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ భక్తవత్సలం పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

29న కోర్టు నూతన భవనం ప్రారంభం



భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తులు

మదనపల్లె : పట్టణంలోని కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఈ నెల 29న చిత్తూరు జిల్లా పోర్ట్‌పోలియో హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ ప్రారంభిస్తారని రెండో అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహాం, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం రెండో ఏడీజే కోర్టులో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో నూతన భవనం ప్రారంభోత్సవానికి సంబంధించి వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కోర్టు నూతన భవనాన్ని పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఆర్‌అండ్‌బీ డీఈ కమ్మగిరి, ఎస్ఐలు రహీముల్లా, అన్సర్‌బాషా, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పురుషోత్తం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

1.5 కిలోల గంజాయి, 3 బైక్‌లు, రూ.14,800 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

కమలాపురం : జాతీయ రహదారిలో తిరిగే లారీలను లక్ష్యంగా చేసుకుని.. డ్రైవర్లను కొట్టి చంపుతామని బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, నగదును దోచుకునే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కడప ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్ వివరాలు వెల్లడించారు. నేషనల్ హైవేలలో దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడానికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో కమలాపురం, సీసీఎస్ సీఐలు షేక్ రోషన్, భాస్కర్‌రెడ్డి, కమలాపురం, వల్లూరు ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, సంజీవ రాయుడు ల టీంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశాయి. చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన దుంపల వినోద్ కుమార్ చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించడం కోసం గుజ్జు సాయి, సి.ప్రశాంత్, పి.ఉదయ్ కుమార్, వై.మురళీధర్, ఎస్.ఆదికేశవరెడ్డి, కె.వెంకట సుబ్బయ్య, సి.నరహరితోపాటు మరో 17 ఏళ్ల బాలునితో కలసి ముఠాగా ఏర్పడి వారికి గంజాయి సేవించడం అలవాటు చేశాడు. ఈ ముఠా రాత్రి సమయాల్లో ఒంటిమిట్ట, బద్వేలు, వల్లూరు, ముద్దనూరు, రాయచోటి, ఎర్రగుంట్ల, కమలాపురం, చాపాడు తదితర పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని హైవేల మీద తిరిగే లారీలను ఆపి డ్రైవర్లను కొట్టి, కత్తులు చూపి చంపుతామని బెదిరించి వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లు, నగదును దోచుకునేది. వినోద్‌కుమార్ వైజాగ్ నుంచి గంజాయి తీసుకువచ్చి తన ముఠాతో విక్రయించి అక్రమ సంపాదనకు పాల్పడుతూ చదువుకునే విద్యార్థులను చెడు అలవాట్లకు దారి మళ్లించి వారి జీవితాలను నాశనం చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన చాపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో లారీ డ్రైవర్‌పై దాడి చేసి మొబైల్ ఫోన్, రూ.9 వేల నగదు, 15న ఒంటిమిట్ట పీఎస్ పరిధిలో మొబైల్ రూ.15 వేలు, 18న వల్లూరు పీఎస్ పరిధిలో మొబైల్, రూ.3500 నగదు, 20న ముద్దనూరు పీఎస్ పరిధిలో రెండు మొబైల్ ఫోన్లు, 10 గ్రాముల బంగారు ఉంగరం, రూ.15 వేలు, ఎర్రగుంట్ల పీఎస్ పరిధిలో మొబైల్ రూ.7500, కమలాపురం పీఎస్ పరిధిలో రూ.4500 దోచుకున్నారు. కొందరు బాధితులు చేసిన ఫిర్యాదుతో.. ఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారు కమలాపురం మండలం గంగవరం ఆర్చి వద్ద శనివారం ఉదయం 9 గంటలకు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, రూ.14800 నగదు, 3 బైక్‌లు, 3 కత్తులు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న రోషన్, భాస్కర్‌రెడ్డి బృందాలను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ బృందాలకు రివార్డు ఇవ్వాలని ఎస్పీని కోరుతామని డీఎస్పీ తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని, వారు చదువుతున్నారా లేదా? ఏమి చేస్తున్నారు అనే విషయాలపై అప్పుడపుడు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన వారిలో నలుగురు బీటెక్ స్టూడెంట్స్ ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐలు ఎస్‌కే రోషన్, భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, సంజీవ రాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కటైన ప్రేమ జంట



తాళి కట్టిన అనంతరం కలిసి ఉన్న ప్రేమికులు

పెనగలూరు : ప్రియుడి కోసం నిరాహార దీక్ష చేసిన లావణ్య ఎట్టకేలకు దక్కించుకుంది. ఆమె మెడలో ప్రియుడు వెంకటసాయి తాళి కట్టడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఈటమాపురం గ్రామానికి చెందిన లావణ్య, తమ బంధువైన వెంకటసాయి నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల అతను వేరే అమ్మాయిని గుట్టు చప్పుడు కాకుండా వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకుని తగిన ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రియురాలికి తెలిసింది. దీంతో ఆమె వెంకటసాయిని తనను వివాహం చేసుకోవాలని నిలదీసింది. ఇందుకు అతను నిరాకరించడంతో లావణ్య పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. తనను నమ్మించి మోసం చేశాడని పోలీసులకు తెలిపింది. చివరకు పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టింది. ఈ విషయం రాజంపేట సీఐ వద్దకు వెళ్లింది. దీంతో ఇరువురి పెద్దలు సీఐ వద్దకు చేరారు. వారికి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామస్తుల సహకారంతో ఇద్దరినీ ఒప్పించారు. దీంతో శుక్రవారం రాత్రి ఓ ఆలయంలో లావణ్య మెడలో వెంకటసాయి తాళి కట్టాడు. గ్రామస్తుల సమక్షంలో ప్రేమికులు ఇద్దరూ ఒకటి కావడంతో కథ ఆనందంగా ముగిసింది.

తండ్రీకుమారులపై దాడి

కురబలకోట : మండలంలోని ముదివేడుకు చెందిన తండ్రి, కుమారుడు ఇంతియాజ్, సల్మాన్‌ఖాన్‌పై అదే ఊరికి చెందిన ప్రత్యర్థి శనివారం దాడి చేసి గాయపరిచారు. వీరి ఇంటి స్థలాన్ని పక్కింటి వ్యక్తి అక్రమంగా కబ్జా చేశాడు. దీన్ని అడ్డుకోబోవడంతో అతను వీరిపై దాడి చేసి గాయపరచినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. బాధితులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగిపోయిన బస్సు.. ప్రయాణికులకు ఇక్కట్లు



నిలిచిపోయిన సొంఠంవారిపల్లి ఆర్టీసీ బస్సు

సుండుపల్లె : రాయచోటి డిపో నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీ బస్సు వయా సుండుపల్లె మీదుగా సొంఠంవారిపల్లిలో శనివారం రిపేరుకు వచ్చి ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాయచోటి నుంచి గ్రామీణ ప్రాంతాలకు కండీషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులు నడపాలని, తరచూ ఎక్కడ పడితే అక్కడ మొరాయించి ఆగిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామీణులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇరు వర్గాల ఘర్షణ

వీరబల్లి : మండల పరిధి ఒంగిమళ్ల గ్రామ పంచాయతీలోని వనంకాడపల్లిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఒకరికి గాయాలయ్యాయి. రాంభూపాల్, రమణ.. నాగేంద్ర అనే రెండు వర్గాల వారు గొడవ పడ్డారు. ఇందులో రాంభూపాల్ తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు.

గ్యాంబ్లింగ్ స్థావరాలపై దాడి

రాజంపేట : మండలంలోని బోయనపల్లె అరుంధతీవాడ, ఎల్లాగడ్డ సమీపంలో గ్యాంబ్లింగ్ స్థావరాలపై శనివారం దాడి చేశామని మన్నూరు సీఐ రామాంజనేయుడు తెలిపారు. ఒక కేసులో 9 మంది, మరో కేసులో ఆరుగురిని అరెస్టు చేశామని ఆయన పేర్కొన్నారు. వారి నుంచి రూ.51 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఏఎస్ఐ సుబ్బయ్య, మన్నూరు పోలీసులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెకు చెందిన అంకిత(20) ఆమె పెద్దమ్మ రెడ్డెమ్మ(60)తో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తుండగా, మార్గం మధ్యలోని మలుపు వద్ద పట్టణంలోని అవంతివీధికి చెందిన సాదిక్(25), సిలార్(26) ద్విచక్రవాహనంలో ఎదురుగా వెళ్లి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అంకిత తీవ్రంగా గాయపడి కాలు విరిగింది. సాధిక్, సిలార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అంకిత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఇన్నోవా ఢీకొని...



గాయపడ్డ రెడ్డిశేఖర్‌రెడ్డి

ద్విచక్రవాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. యర్రబెల్లి గ్రామం బలకవారిపల్లెకు చెందిన బి.రెడ్డిశేఖర్‌రెడ్డి(30) ద్విచక్రవాహనంలో కంటేవారిపల్లె నుంచి బలకవారిపల్లెకు వస్తుండగా, గ్రామసమీపంలో ఎదురుగా వచ్చిన ఇన్నోవా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డిశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.